ప్రజాశక్తి
గురువారం 06 మార్చి 2025
5
కర్నూలు



ఈసారీ కందిపప్పు లేదు..!

• ఈనెల రేషన్‌లోనూ సరఫరా చేయని ప్రభుత్వం • బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.150పైనే

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 1,228 రేషన్ షాపులు ఉండగా వాటి పరిధిలో 6,76,209 రేషన్ కార్డులు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటికి నెలనెలా బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. నాలుగు నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డుకు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన నెలకు కర్నూలు జిల్లాకు 676.209 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 541.804 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. జిల్లాలో కొన్ని నెలలుగా కందిపప్పు సరఫరా పూర్తిస్థాయిలో జరగడం లేదు. ఫిబ్రవరి నెలలో 30 శాతం కార్డులకు బఫర్ స్టాక్ నుంచి పంపిణీ చేశారు. మార్చి నెలలో అసలు ఎలాంటి కేటాయింపులు చేయలేదు. దీంతో జిల్లాలో ఒక్క లబ్ధిదారునికి కూడా కందిపప్పు ఇవ్వడం లేదు. కందిపప్పు పూర్తిగా నిలిపివేయడంతో పేదలు పప్పునీళ్లకు కూడా దూరమయ్యారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫరా చేయాల్సిన సరుకులను ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ వస్తుంది. గతంలో టిడిపి ప్రభుత్వం క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం మాత్రమే పూర్తిస్థాయిలో ఇచ్చారు. ప్రతి నెలా కందిపప్పు అరకొరగానే పంపిణీ చేశారు. పండుగ తోఫాలకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ఈ ఏడాది జూన్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమీక్ష సందర్భంగా అన్ని సరుకులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కాని ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా ఉంది. కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారుల్లో నిరాశే మిగిలింది. వినాయక చవితి, దసరా, సంక్రాంతి వంటి పండుగలకు ప్రభుత్వం అన్ని రేషన్ సరుకులను ఇస్తుందని లబ్ధిదారులు ఆశించినా నిరాశే ఎదురైంది.

> ప్రజా పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తామని, ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్ మొదటి నుంచి సమీక్షల్లోనూ చెబుతూనే ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది కూటమి సర్కారు ప్రజా పంపిణీ వ్యవస్థను గాడిలో పెడుతుందంటూ చెప్పుకొచ్చారు. అయితే ఆచరణలో పూర్తి స్థాయిలో సరుకుల పంపిణీపై దృష్టి సారించలేకపోతున్నారు. ఐదు నెలలుగా రేషన్‌లో కందిపప్పు సరఫరా కావట్లేదు. కేవలం బియ్యం, పంచదారతోనే సరిపెడుతున్నారు...

బహిరంగ మార్కెట్లో కొనలేక

ప్రజలు నిత్యం వాడే కందిపప్పు నాణ్యతను బట్టి ధర రూ.150 నుంచి 180 వరకూ ఉంది. రాయితీ పోను కిలో కందిపప్పు రూ.67కే లభిస్తున్నందున రేషన్ షాపుల ద్వారా కందిపప్పు పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నా కూటమి సర్కారు సైతం పట్టించుకోవడం లేదు. కందిపప్పు ధర భారీగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారు. ఇప్పటికే నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దానికి తోడు పేదలపై భారాలు రోజురోజుకి ఎక్కువ అవుతున్నాయి. దీంతో కందిపప్పు కొనుగోలు చేయలేని దుస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తున్నామనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్ల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ చేపట్టింది. అది నాణ్యత తక్కువగా ఉండడంతో వినియోగదారులు కొనుగోలు చేసేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. బహిరంగ మార్కెట్లో ఉన్న ధరపై రూ.10 నుంచి రూ.20 వరకు కిలోపై ధర తగ్గిస్తున్నా, ఇది రెండో రకం కందిపప్పు కావడంతో తీసుకునేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు.





సమావేశంలో మాట్లాడుతున్న గఫూర్

ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి

- ప్రజా సమస్యలు పట్టని పాలకులు
- కాషాయ, కార్పొరేటు విధానాలు దేశానికి ముప్పు
- రాజ్యాంగ వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వ దాడి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 17 వరకు నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పిలుపునిచ్చారు. బుధవారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సిపిఎం జిల్లా జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి.అంజిబాబు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, కెవి నారాయణ పాల్గొన్నారు. ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ... రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలో బిజెపి మతోన్మాద అజెండాను అమలు చేస్తోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పాలన పేరుతో లౌకిక భావనకు తూట్లు పొడుస్తోందన్నారు. రాష్ట్రాల హక్కులను హరిస్తుందన్నారు. నిధులను కాజేస్తోందన్నారు. మతోన్మాద కార్పొరేటు శక్తులతో జతకట్టి దేశాన్ని దోచేస్తున్నారన్నారు. 2014లో దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య 100 మంది కాగా నేడు ఆ సంఖ్య 200 కు చేరిందన్నారు. రూ.1.46 వేల కోట్లు కార్పొరేట్ సంస్థల అప్పులను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కోడ్లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను కాలరాసిందన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించి రైతుల గొంతుకు ఉరిబిగించిందన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ సేవలను గౌరవిస్తారు కానీ, ఆయన ప్రతిపాదించిన సూచనలను పాలకులు ఏమాత్రం గౌరవించకపోవడం శోచనీయమన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి సహకారం అందించడంలో, గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం వల్ల సంక్షోభం విస్తరిస్తోందన్నారు. ప్రధానమంత్రి నిరుద్యోగులకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ అటకెక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు వంత పాడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం విస్మరించిందన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు విడుదల చేయకపోవడం వల్ల పేదలు గ్రామాలను వదిలి పొరుగు జిల్లాలకు వలసలు వెళ్తున్నారన్నారు. నిరుపేదలకు తలదాచుకునేందుకు కనీస గూడు కరువైందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. పాలకులు ఎన్నికలముందు ఇచ్చిన హామీలు నీటి మీది రాతలుగానే మిగిలాయన్నారు. జిల్లాలో పెండింగులో ఉన్న వివిధ సాగు, తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయిందని అన్నారు. నిత్యవసరాల ధరలు కొండెక్కి కూర్చున్నాయని, సామాన్యుడు పూట గడవడం కష్టసాధ్యమైందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఎండగట్టేలా ప్రజల్లోకి విస్తతంగా వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ... జిల్లాలో వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో స్థానికంగా తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఎక్కడికక్కడ సమస్యలను గుర్తించి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రైతులు కార్మికుల సమస్యలను గుర్తించి, పరిష్కార దిశగా పోరాటాలు నిర్వహించాలని అన్నారు. పార్టీ ప్రజా పునాదిని వేయడానికి కృషి చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, పిఎస్ రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, సి.గురు శేఖర్ పాల్గొన్నారు.

సాధికారత చాటేలా మహిళా దినోత్సవం

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహిళా సాధికారతను చాటేలా మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మహిళా దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను నిర్వహించాలని ఆదేశించారు. డిఆర్ డిఎ, మెప్మా శాఖలు కీలక పాత్ర పోషించాలన్నారు. మహిళా సంఘాల్లో విజయవంతంగా వ్యాపారాలు చేస్తున్న వారిని, పారిశ్రామిక వేత్తలు తదితరులను ఈ వేడుకలకు ఆహ్వానించాలన్నారు. ఆయా రంగాల్లో విజయాలు సాధించిన మహిళలను ఆహ్వానించి సన్మానం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద బ్యాంకు రుణాల మంజూరు, బ్యాంక్ లింకేజి, ఇతర ఆర్థిక సహాయాలు మహిళా లబ్దిదారులకు మెగా చెక్‌లు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నైపుణ్యాభివృద్ధిలో భాగంగా శిక్షణ పొందుతున్న వారిని కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. జీవనోపాధిని పెంచే రాపిడో ఎలక్ట్రిక్ బైక్స్ వంటి ఆస్తుల పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా ఒక సెంటర్‌ను గుర్తించాలని బిసి కార్పొరేషన్ ఇడిని ఆదేశించారు. ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా ఆర్థిక సహాయం, శిక్షణకు సంబంధించిన మహిళా లబ్ధిదారులకు మెగాచెక్‌లు, ఇతర సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మూడు వేల మంది మహిళలు పాల్గొనేలా సమావేశపు వేదికను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ , ఐసిడిఎస్ పిడి నిర్మల, మెప్మా పిడి నాగశివలీల, డిఆర్‌డిఎ పిడి రమణారెడ్డి, ఎల్‌డిఎం రామచంద్రరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా


లీనాక్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సిబ్బంది

స్టేట్ కేన్సర్ హాస్పిటల్లో 80 శాతం వైద్య సేవలు

- లీనాక్ మిషన్‌ను ప్రారంభించిన స్టేట్ కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నెలకొల్పిన 'స్టేట్ కేన్సర్ హాస్పిటల్‌లో 80 శాతం వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, కేన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ కె.ప్రకాష్‌లు బుధవారం తెలిపారు. కేన్సర్ చికిత్సకు ఉపయోగించే అత్యాధునిక పరికరం 'లీనాక్ మిషన్' కూడా ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే ఓపి సేవలు, ఇన్ పేషెంట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, మరికొన్ని ఆపరేషన్ థియేటర్ పరికరాలు రావాల్సి ఉందని, అవి వచ్చిన వెంటనే త్వరలో ఆపరేషన్ థియేటర్ సేవలు కూడా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

- కర్నూలు 3వ పట్టణ పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

- పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు మూడవ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పోలీసులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను త్వరగా డిస్పోజ్ చేయాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా సమస్యల పట్ల పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. జిల్లా ఎస్‌పి వెంట కర్నూలు డిఎస్‌పి జె.బాబుప్రసాద్ , కర్నూలు మూడవ పట్టణ పిఎస్ సిఐ శేషయ్య, ఎస్ఐ మన్మథ విజయ్ ఉన్నారు.


తనిఖీలు చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



మహిళ చదువు ఇంటికి వెలుగు

-రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు

-క్లస్టర్ వర్సిటీ విద్యార్థులు భేటీ బచావో బేటి పడావో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని, మహిళ చదువుకుంటే ఆ ఇంటిల్లిపాది చదువు కున్నట్లేనని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మహిళా వారోత్సవాలు పురస్కరించుకొని బుధవారం క్లస్టర్ యూనివర్సిటీ మహిళా సాధికారత విభాగం కన్వీనర్ డాక్టర్ అక్తర్ భాను అధ్యక్షతన సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు ప్లాకార్డులతో బికాంప్ విజ్ఞాన మందిర్ సర్కిల్ వరకు భేటీ బచావో బేటి పడావో ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డి, యూనివర్సిటీ డీన్లు డాక్టర్ నాగరాజ్ శెట్టి, డాక్టర్ వాహిద్, ,విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్‌యులో విద్యార్థుల నిరసనను ఉద్దేశించి మాట్లాడుతున్న రామకృష్ణ

పశ్చిమ బెంగాల్ మంత్రిని బర్తరఫ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో జాదవ్ పూర్ యూనివర్సిటీలో ఆ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బ్రత్యబాసు విద్యార్థులపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ అన్నారు. వెంటనే మంత్రిని బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి యూనివర్సిటీ నాయకుడు రాజు అధ్యక్షతన నిరసన చేపట్టారు. వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించిమంటే విద్యార్థులపై తన కాన్వాయితో దాడి చేయడమనేది చాలా దుర్మార్గమని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరించటం దారుణమన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థులపై తన కాన్వాయితో దాడి చేయించడం దుర్మార్గంగా భావిస్తున్నామన్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి వెంటనే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సాగర్, రాజు, అమర్, దివాకర్, కపాకర్, రాజా, రాజ్ కుమార్, ప్రసాద్, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలి

అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలి
స్మార్ట్ మీటర్స్ బిగించడం మానుకోవాలి
సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించాలి
అఖిలపక్ష రైతు సంఘాల డిమాండ్
కర్నూలు సుందరయ్య సర్కిల్‌లో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు తక్షణమే అమలు జరపాలని అఖిలపక్ష రైతు సంఘాల డిమాండ్ చేశాయి. అఖిలపక్ష రైతు సంఘాల పిలుపుమేరకు బుధవారం కర్నూలు సుందరయ్య సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె. వెంకటేశులు అధ్యక్షత వహించారు.ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ, ఎఐకెఎంఎస్ నాయకులు వెంకటస్వామి, సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ ,ఎన్.అలివేలు, మాట్లాడారు. 2012వ సంవత్సరం నుండి ఇప్పటివరకు లక్ష మంది పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మద్దతు ధర చట్టాన్ని అమలు చేస్తామని చెప్పిన ఎన్‌డిఎ ప్రభుత్వం చేయలేక సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం రైతులను దగా చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వలన రైతులకు మరింత భారం అవుతుందని, అనేక సంఘాలు తమ వ్యతిరేకతను నిరసనను, అసమ్మతిని తెలిపినా కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రాష్ట్రాల పైన రుద్ది రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేయడం శోచనీయమన్నారు. రైతాంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఏమాత్రం ఆశాజనకంగా లేదని వారు తెలిపారు. కర్నూలు జిల్లాలో వేదవతి ప్రాజెక్టు, గుండ్రేవుల రిజర్వాయర్ ,ఆర్‌డిఎస్ కుడి కాలువలు నిర్మాణం చేసినట్లయితే కరువును శాశ్వతంగా పారద్రోలడానికి అవకాశం ఉందన్నారు. నిన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఈ మొత్తం సాగునీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదంటే ఇది రైతు ప్రభుత్వమా, రైతు వ్యతిరేక ప్రభుత్వమా అని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాలో రూ.20,000 జమ చేస్తామని చెప్పి ఎన్నికల్లో ఓట్లు దండుకొని ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వకపోవడం ఇది మోస కార్యక్రమం తప్ప మరొకటి కాదని విమర్శించారు. ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలు విడనాడి రైతాంగాన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎ. .కృష్ణ, జిల్లా నాయకులు బాషా, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల. శేఖర్, రైతు కూలీ సంఘం నాయకులు ఖాజా, రాజు, మహిళా సంఘం నాయకులు సుజాత , తదితరులు పాల్గొన్నారు.



కొత్తబస్టాండు సుందరయ్య సర్కిల్‌లో ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

మహిళలు ఐక్యంగా ప్రతిజ్ఞ చేయాలి

స్త్రీ సాధికారతకు సమానత్వం పునాది

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

స్త్రీ సాధికారతకు సమానత్వం అంటూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని సమత ముద్రించిన ప్రత్యేక సంచికను బుధవారం కార్మిక కర్షక భవన్‌లో ఐద్వా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు మాట్లాడుతూ స్త్రీ విద్యావంతు రాలైతే ఆ కుటుంబం అంతా మంచిగా తీర్చి దిద్దుతుందని చెప్పారు. ప్రతి సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున సభలు, సమావేశాలు నిర్వహించే పండగల జరుపుకొని పోవడం కాదని, మహిళలు ఐక్యంగా ప్రతిజ్ఞ చేసి మహిళలకు అండగా నిలవాలని కోరారు.ప్రస్తుత ప్రభుత్వ విధానాలు ఎండగడుతూ మహిళలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమాజంలో స్త్రీలు 50 శాతం ఉన్న వారికి రావాల్సిన హక్కులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలలో బాల్యంలోనే ఆడ, మగ తేడా చూపకుండా సమానంగా నేర్పాలని ఆత్మ రక్షణ కోసం శిక్షణ ఇచ్చి పురుషులతో సమానంగా తీర్చిదిద్దాలని తెలిపారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలు సమాన స్థానం కల్పించాలని భారత రాజ్యాంగం పేర్కొందని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానులేనని భారత శిక్షాస్మృతి స్పష్టం చేస్తుందన్నారు. ఇవన్నీ కాగితాలకు పరిమితమైనాయని, పని ప్రదేశాల్లో మహిళా కార్మికులను అన్ని విధాల రక్షణ కల్పించే బాధ్యత ఆయా సంస్థల తీసుకోవాలని చెప్పారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు లేకుండా చూడాలన్నారు. ప్రస్తుత సమాజంలో చిన్నపిల్లలు మొదలుకొని వయోవృద్ధుల వరకు మహిళలపై గృహహింస, అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయి. వాటిని రక్షించడానికి మహిళలకు ఉన్న చట్టాలను ప్రభుత్వాలు సక్రమంగా నిర్వర్తించి దోషులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. సెల్ఫోన్ యూట్యూబ్‌లో వచ్చే అసాంఘిక కార్యక్రమాలను నివారించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఆర్థిక వనరుగా భావించి మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మడంతో పురుషులు తాగి మహిళలపై లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.అరుణ, జిల్లా నాయకులు బి.పద్మ, కుమారి, పిఎస్. సుజాత, టి. బాల లక్ష్మి, ఎస్.మాలన్ తదితరులు పాల్గొన్నారు.


సమత ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు ఎన్అలివేలు, అరుణ, సుజాత

ఇంటర్ పరీక్షల్లో ఏడుగురు డీబార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతూ డీబార్ అయ్యారు. సోమవారం ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మొత్తం 20496 మంది విద్యార్థులు రాయాల్సి ఉండగా 20147మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు రాశారు. 328 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఆలూరు పరిధిలోని పరీక్ష కేంద్రంలో నలుగురు విద్యార్థులు ఆదోని పరిధిలోని పరీక్షా కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతూ డి.బార్ అయ్యారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమిషనర్ శ్రీదేవి

నాటు సారా నిర్మూలనకు అవగాహన

ప్రజాశక్తి- వెల్దుర్తి

వెల్దుర్తి మండలం ఎల్‌నగరం తండాలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నవోదయం కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన పై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ నాటు సారా వల్ల జరిగే అనర్థాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ నాటుసార తయారీ, అమ్మకందారుల పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తయారీ మాను కొనేవారికి జీవనాధారం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరిన్‌టెన్‌డెంట్ సుధీర్ బాబు, ఎఇఎస్ రాజశేఖర్ గౌడ్, ఇఎస్‌టిఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎక్సైజ్ సిఐ మంజుల , ఎక్సైజ్ ఎస్ఐ చంద్రమోహన్ , వెల్దుర్తి ఎఎస్ఐ శివరామిరెడ్డి, విఆర్‌ఒ కృష్ణమూర్తి, కోడుమూరు ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మైపర్ లో ట్రాఫిక్ పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


కర్నూల్ నగరంలోని ఎ క్యాంపులోని మైపర్ ఫార్మసీ కళాశాలలో బుధవారం ట్రాఫిక్ పైన అవగాహన కల్పించారు. నగర ట్రాఫిక్ సిఐ ఎస్.మన్సూర్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు వాటిని ఉల్లంఘిస్తే ఏ విధమైన చర్యలు ఉంటాయనే దానిపై అవగాహన కల్పించారు. కొన్ని వీడియోలను ప్రదర్శించి ఏ విధమైన తప్పులు చేయకుండా వాహనాన్ని ఎలా నడపాలి, ప్రమాదాలు జరగకుండా ఉండడానికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో , ట్రాఫిక్ ఎస్ఐ హుస్సేన్ , కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె మహాలక్ష్మి , ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ , వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కాసర్ల సురేష్ ఇతర అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - కౌతాళం



రీచ్‌ను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

తుంగభద్ర నదిలోని ఇసుక రీచ్‌లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. బుధవారం గుడికంబాలి ఇసుక రీచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక పంపిణీ ప్రక్రియను కొనసాగించాలన్నారు. నిబంధనలు పాటించకుంటే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందే మండలంలో రీసర్వే పైలట్ ప్రాజెక్టుగా ఎన్నికైన గుడికంబాలి గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను గ్రామ సచివాలయంలో సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి సమీక్షించారు. తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'చంద్రన్న సంచార చికిత్స' తనిఖీ

ప్రజాశక్తి - దేవనకొండ




తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ రఘు

దేవనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పొట్లపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతా శిశు సంక్షేమం విషయంలో పకడ్బందీ ప్రణాళిక అమలు చేస్తూ మాతా శిశు మరణాలను తగ్గించవచ్చని సూచించారు. వైద్య, ఆరోగ్య సేవల్లో ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలని కోరారు. దీనిపై దృష్టి పెట్టి వైద్య సేవలు, ఇతర కార్యక్రమాల వివరాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గర్భిణీగా నమోదు చేసుకున్న తర్వాత రక్త హీనత, మూత్ర పరీక్షలతో పాటు థైరాయిడ్, హెచ్‌ఐవి, సిఫిలిస్, ఇతర సుఖ వ్యాధుల పరీక్షలు చేయాలని సూచించారు. డాక్టర్ కల్యాణ్, చంద్రశేఖర్, సామాజిక ఆరోగ్య అధికారి భాగ్యలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త నాగవేణి, ఆశా కార్యకర్త, ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

'సమగ్ర'కు జిఒ 2ను వర్తింపజేయాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - కౌతాళం



నిరసన చేపడుతున్న ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగులకు జిఒ 2ను వర్తింజేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు స్థానిక ఎంఆర్‌సి భవనం ముందు బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామాంజనేయులు, పుష్పవతి మాట్లాడారు. సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు, మినిమం టైం స్కేల్ అమలుపరిచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి ఒకేసారి బడ్జెట్ రిలీజ్ చేయాలని, గ్రాట్యుటీ అమలుపై నిరసనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చొరవ తీసుకొని ఈ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేకపోతే ఈనెల 11న విజయవాడలో రాష్ట్ర జెఎసి నాయకులు, అన్ని జిల్లాల నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులతో దీక్ష నిర్వహిస్తామని హెచ్చరించారు. జెఎసి మండల నాయకులు నాయకులు సి.రమేష్, కోశాధికారి కె.రామన్న, జెఎసి కమిటీ సభ్యులు మాబాష, అకౌంటెంట్ వరదరాజులు, షబానా పర్వీన్, సాయికుమార్ పాల్గొన్నారు.

'మొండి బకాయిలు చెల్లించండి'

ప్రజాశక్తి - చిప్పగిరి



రైతులతో మాట్లాడుతున్న సొసైటీ అధికారులు

బెల్డోన సొసైటీ బ్యాంకులో దీర్ఘకాలిక, స్వల్పకాలిక, పంట రుణాలు పొందిన రైతులందరూ మొండి బకాయిలను చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సిఇఒ హరికృష్ణ, జిల్లా నుంచి వచ్చిన ప్రత్యేకాధికారులు తెలిపారు. బుధవారం చిప్పగిరితో పాటు కుందనగుర్తి, బెల్డోన, నేమకల్లు గ్రామాల్లో బకాయిలున్న రైతులు ఇంటి దగ్గరకు వెళ్లి బకాయిలను చెల్లించాలని తెలిపారు. లేకపోతే ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఎక్కించుకోవాలంటే

చేయి తడపాల్సిందే..!

- బిల్లేకల్లు గ్రామ ఇంజినీర్ అసిస్టెంట్ నిర్వాకం



ప్రజాశక్తి - ఆస్పరి

అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ ఉచితంగా పథకాలు అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నా కిందిస్థాయిలో అధికార యంత్రాంగం చేయి తడపనిదే పని జరగడం లేదు. ప్రభుత్వం మంజూరు చేసే ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తులను ఆన్‌లైన్ ఎక్కించేందుకు బిల్లేకల్లు గ్రామ ఇంజినీర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ లంచం డిమాండ్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.500 నుంచి రూ.2 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్టు తెలిసింది. చేయి తడపనిదే ఆన్‌లైన్ ఎక్కించడం లేదని బాధితులు వాపోతున్నారు. బిల్లేకల్లు గ్రామానికి చెందిన ఈడిగ సురేష్ తన ఇంటి కోసం దరఖాస్తును ఆన్‌లైన్ ఎక్కించాలని ఇంజినీర్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌ను కలిశారు. గతంలో ఇల్లు మంజూరు కావడం వల్ల ప్రస్తుతం కొత్త గృహం మంజూరు కాదని ఇంజినీర్ అసిస్టెంట్ తెలిపారు. గతంలో తాను ఇంటికే దరఖాస్తు చేయలేదని, ఎలా మంజూరు చేస్తారని సురేష్ ప్రశ్నించారు. ఆన్‌లైన్‌లో ఎక్కించాలంటే రూ.1000 ఇవ్వాలని ఇంజినీర్ అసిస్టెంట్ డిమాండ్ చేశారు. 'అంత ఇవ్వలేను' అని చెప్పి రూ.500 ఇచ్చినట్లు సురేష్ తెలిపారు. డబ్బులు ఇచ్చిన వారి పేర్లు ఎక్కిస్తున్నారని, ఇవ్వని వారి పేర్లు ఏదో ఒక కారణం చూపి పంపిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో అర్హులైన చాలామంది బాధితులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాల మంజూరుకు డబ్బులు ఆశిస్తున్న ఇంజినీర్ అసిస్టెంట్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే కలెక్టరేట్‌కు వెళ్తామని గ్రామస్తులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న పత్తికొండ డిఎల్‌పిఒ వీరభద్రప్ప

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- డిఎల్‌పిఒ వీరభద్రప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని పత్తికొండ డిఎల్‌పిఒ వీరభద్రప్ప, ఎంపిడిఒ గీతావాణి తెలిపారు. బుధవారం ఆస్పరిలోని చెత్త సంపద కేంద్రం వద్ద సర్పంచి రాధమ్మ అధ్యక్షతన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి, పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు. ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పంచాయతీ అధికారులు ఇచ్చిన బుట్టల్లో తడి, పొడి చెత్త వేసి పంచాయతీ కార్మికులు కాలనీకి చెత్త సేకరణకు వచ్చినప్పుడు వేయాలని సూచించారు. ఎవరూ చెత్తను రోడ్లపై, ఇంటి చుట్టుపక్కల వేయరాదన్నారు. దేవనకొండ ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇఒఆర్‌డి విజయ భాను, పంచాయతీ కార్యదర్శులు విజయ రాజు, జంప్లా నాయక్, కృష్ణ, సురేష్, సునీల్, లక్ష్మణ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చిలుకలడోణ గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని సూపర్ వైజర్ నాగలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. అంగన్వాడీ టీచర్ ఇందిరమ్మ అంగన్వాడీ కేంద్రంలో మెనూ పాటించడం లేదని, వెంటనే తొలగించాలని వచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె తనిఖీ చేశారు. లబ్ధిదారులను కేంద్రానికి పిలిపించి విషయం అడిగి తెలుసుకున్నారు. టీచర్ ఇందిరమ్మ పని తీరును, పిల్లల పౌష్టికాహారం పంపిణీపై పంపిణీ గురించి ఆరాతీశారు. తమకు సక్రమంగా అందుతోందని పిల్లల తల్లిదండ్రులు సమాధానం చెప్పారు.

ఆరోగ్యానికి మించిన వరం లేదు

- సిఐలు శ్రీరామ్, సుబ్బారావు

ప్రజాశక్తి - ఆదోని

ఆరోగ్యానికి మించిన వరం లేదని, పని ఒత్తిడిలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సిఐలు శ్రీరామ్, గంట సుబ్బారావు తెలిపారు. బుధవారం పట్టణంలోని పోలీసు క్వార్టర్స్ ఆవరణలో కర్నూలు మెడికవర్, ఆదోని మధు ఆస్పత్రి సౌజన్యంతో పోలీసులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఊపిరితిత్తులు, గుండెకు సంబంధించిన రుగ్మతలు, చర్మవ్యాధులు తదితర అనారోగ్య సమస్యలకు పరీక్షలు చేశారని తెలిపారు. అనారోగ్య పరిస్థితులను బట్టి ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఎస్ఐ రామనాథ్, ఎఎస్ఐలు లక్ష్మన్న, సత్యనారాయణ, పోలీసులు ఉన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న పోలీసులు, వైద్యులు

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు నిర్మాణం

- 2వ వార్డు ఇన్‌ఛార్జీ నజీర్ అహ్మద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి చొరవతో 2వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని టిడిపి వార్డు ఇన్‌ఛార్జీ తురేగల్ నజీర్ అహ్మద్ తెలిపారు. బుధవారం రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరులోని ప్రతి వార్డులోనూ సిసి రోడ్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం వార్డుల్లో కానీ, పట్టణంలో ప్రధాన రహదారులు కానీ రోడ్డు వేసిన దాఖలాలు లేవని విమర్శించారు. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే బీవీ పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తయారు చేసి తీరుస్తారని పేర్కొన్నారు. వార్డు నాయకులు వాల్మీకి రాజు, సరోజమ్మ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న నజీర్ అహ్మద్

సమస్యలు ఏర్పడకుండా కొలతలు చేపట్టాలి

- డివిజనల్ సర్వేయర్ భాస్కర్

ప్రజాశక్తి - చిప్పగిరి

రైతులకు సమస్యలు ఏర్పడకుండా కొలతలు చేపట్టాలని డివిజనల్ సర్వేర్ భాస్కర్, తాసిల్దార్ ఇజాజ్ అహ్మద్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బంటనహాల్ గ్రామంలో గత 20 రోజుల నుంచి రెవెన్యూ సిబ్బంది చేపడుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు. భూ రీ సర్వే కొలతలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పొలాలను సర్వే చేస్తున్న నేపథ్యంలో రైతులకు ఎక్కడా ఏ సమస్యలు వచ్చినా నివృత్తి చేసే బాధ్యత మనపై ఉందన్నారు. ఒక పొలాన్ని కొలతలు వేసేటప్పుడు ఆ పొలం చుట్టూ ఉన్న రైతులందరికీ సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ రీ సర్వే పనులను పారదర్శకంగా చేపట్టాలని, పొలంలో వచ్చిన సమస్యలను రైతులకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. మండల సర్వేయర్ నారాయణ, రెవెన్యూ కార్యదర్శులు గోవిందప్ప, వన్నూరు స్వామి, విలేజ్ సర్వేయర్ వినోద్ కుమార్, రైతులు పాల్గొన్నారు.



సర్వే కొలతలను పరిశీలిస్తున్న డివిజనల్ సర్వేయర్, తహశీల్దార్



ఘనంగా టిటిడి పట్టు వస్త్రాల ఊరేగింపు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామి జన్మదినం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) నుంచి వచ్చిన పట్టు వస్త్రాలను ఘనంగా ఊరేగించారు. బుధవారం టిటిడి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లోకనాథ్ తలపై పెట్టుకొని తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను శ్రీమఠం ప్రధాన ఆర్చి వద్ద నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారం వరకు ఘనంగా ఊరేగించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు అందజేశారు. ఆయన కూడా తలపై పెట్టుకుని రాఘవేంద్రస్వామి మూల బృందావనం వద్ద నుంచి ఆయనకు సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. అనంతరం పీఠాధిపతులు డిప్యూటీ ఇఒ లోకనాథ్‌కు జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు.

మహారాజ శ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి గారి కోర్టులో
ఎ.యస్.నెం.49/2024

బోయరవి. ...అప్పిలెంటు

-వర్సెస్-

మహకాళి మద్దిలేటి వగైరా. ...రెస్పాండెంట్లు

4వ రెస్పాండెంటుకు నోటీసులు

బోయరవి తండ్రి చిన్నరాముడు,
నాగలూటి గ్రామం, మిడుతూరు మండలం,
కర్నూలు జిల్లా.

పై నెంబరు అప్పిలో అప్పిలెంటు నందికొట్కూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఐ.పి.నెం.3/2019, 27-06-2019వ తేదిన ఇచ్చిన తీర్పుపైన అప్పీలు చేసినాడు. ఇందులో 4వ రెస్పాండెంటు అయిన నీకు ఆక్షేపణ ఉన్న తేది 17-03-2025 పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల సదరు అర్జీని నీపరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 17-3-2025

బి. నాగలక్ష్మిరెడ్డి,
అప్పిలెంటు పరం అడ్వకేటు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
O.S.No.87/2023

A.AnjanReddy. ...Plaintiff

-Vs-

Sukur Basha. ...Defendant

ప్రతివాదికి దావా సమన్లు

Sukur Basha S/o Kasim Sab,
LalmanPalli village,Krishnagiri (M),
Kurnool District.

పై నెంబరు దావా వాది,ప్రతివాది నుండి ప్రామిసరీనోటు బాకీ బాపతు మరియు వడ్డీ,కోర్టు ఖర్చులు రాబట్టుకొనుడకు ప్రతివాది అయిన మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఎమైన ఆక్షేపణ ఉన్న యెడల తేది 26-03-2025 పగలు 10.30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా : 26-3-2025

డి. నరేంద్రరెడ్డి,
జి.కె.రావు,
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు.

మహారాజ శ్రీ ఆదోని సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం.14/2021

కమ్మరి.వీరేష్ ఆచారి. ...అర్జీదారు

-వర్సెస్-

బి.అర్జున్ మరియు 18 మంది ఇతరులు. ...రెస్పాండెంట్లు

జనరల్ నోటీసు

ఇందుమూలముగా ఎమ్మిగనూర్ ప్రజలకు తెలియజేయడం ఏమనగా పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు కమ్మరి.వీరేష్ ఆచారి తండ్రి కె.బ్రహ్మయ్య ఆచారి, ఇంటి.నెం. 1/1312-బి,యల్.ఐ.సి ఆఫీస్ రోడ్డు, ఎమ్మిగనూర్ టౌన్,కర్నూలుజిల్లా, అను నతడు తనను దావాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి అర్జీ దాఖలు చేసినాడు. ఇందుపైన రెస్పాండెంట్లు అయిన మీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 12-03-2025వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

వాయిదా :12-3-2025

డి.నరేంద్రరెడ్డి
జి.కె.రావు,
వాదిపరం అడ్వకేట్లు,
కర్నూలు.

మహారాజ శ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఇ.పి.నెం.134/2024 ఇన్ ఓ.యస్.నెం.1053/2020

డి.మహేశ్వరి. ...డిక్రిహోల్డర్

-వర్సెస్-

యం.రామాంజనేయులు
పోతివారసులు యం.రంగమ్మ వాగైరా. ...జె.డి.ఆర్స్

1,2,3 జె.డి.ఆర్‌లకు ఆర్డర్ 21 రూల్ 22 సి.పి.సి ప్రకారం నోటీసులు


1.యం.రంగమ్మ భర్త లేటు యం.రామాంజనేయులు,
2.టి.యం.పద్మావతి తండ్రి లేటు యం.రామాంజనేయులు,
3.యం.వీరేష్‌కుమార్ తండ్రి లేటు యం.రామాంజనేయులు,
అందరి నివాసం: ఇంటి.నెం.బి/సి-4,
బి.క్యాంపు, కర్నూలు.

పై నెంబరు ఇ.పి.లో డిక్రిహోల్డర్ తనకు రావలసిన ఇ.పి మొత్తం రూ.6,52,561/- రాబటు కొనుటకు పై కోర్టుకి అమలు అర్జీదాఖలు చేసియున్నారు. ఇందులో 1,2,3 జె.డి.ఆర్‌లు అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల 10-03-2025 వ తేది ఉదయం 10.30 గంటలకు మీరు కాని మీ తరుపు అడ్వకేటు ద్వారా కాని హాజరై మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో హాజరై తెలుపుకొనగలరు. లేని యెడల సదరు అర్జీ మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 10-3-2025

శ్రీ బద్దల వెంకటేశ్వర్లు,
శ్రీ బద్దల లక్ష్మినారాయణ,
శ్రీ బాబసాహెబ్,
డి. హెచ్. ఆర్.పరం అడ్వకేట్లు,
కర్నూలు.



బీవీకి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

ఎస్సీ సర్టిఫికెట్‌కు బీవీ కృషి

- మాదాసి/మాదారి కురువ సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మాదాసి/మాదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేసే విషయంపై ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి శాసనసభలో మాట్లాడారని మాదాసి/మాదారి కురువ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే బీవీ బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని మరోసారి నిరూపించారని తెలిపారు. ఇప్పటివరకు మాదాసి/మాదారి కురువల గురించి చట్టసభల్లో మాట్లాడిన నాయకులే లేరని, ఎమ్మెల్యే బీవీ కురువల పక్షపాతి అని చట్టసభల సాక్షిగా నిరూపించారని చెప్పారు. కురువ సాధికారిక కమిటీ కర్నూలు పార్లమెంట్ సభ్యులు కెటి.వెంకటేష్, బనవాసి నరసింహుడు, అయ్యాలప్ప, కలుగొట్ల బుడ్డ ఈరన్న, మసీదుపురం రాముడు, చెన్నాపురం నాగరాజు, దైవందిన్నె వెంకటేష్, గార్లదిన్నె శివ, పార్లపల్లి వెంకటేష్, పెసలదిన్నె హనుమంతు పాల్గొన్నారు.

9న కంటి ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో అవోపా, వామ్ ఆధ్వర్యంలో శాంతిరామ్ ఆస్పత్రి నంద్యాల, ఎన్‌టిఆర్ వైద్య సేవ(ఆరోగ్యశ్రీ) సహకారంతో ఎన్ఆర్ఐ కాకుబళ్ నాగేష్ సౌజన్యంతో ఈనెల 9న కంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అవోపా, వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో వైద్యుల సలహా మేరకు ఉచిత కంటి శుక్లం ఆపరేషన్లు నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి, ఎన్‌టిఆర్ వైద్య సేవా సహకారాలతో చేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలోనే వసతి భోజనం, మందులు, రానుపోను రవాణా సౌకర్యం, రోగులకు ఉచితంగానే ఉంటుందని చెప్పారు. ఆదోని ఎస్‌కెడి కాలనీ 4 రోడ్డులో గల సాయి భారతి స్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9980269662 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

కాటికాపరులను ఆదుకోవాలి

- కాటికాపరుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని కాటికాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని సంఘం నాయకులు జి.సురేష్, జి.మారెప్ప డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లోని శ్మశాన వాటికలో గుంతలు తీయడం, మృతదేహాలను పూడ్చడం వంటి పనులు చేసే కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గుంతలు తీసే సమయంలోనూ, మృతదేహాలను కాల్చే సమయంలోనూ వివిధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. వాటికి భయపడకుండా విధులు నిర్వహిస్తున్న కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాల్లో శ్మశానాల్లో స్థలాలు లేక వేరొకరు పూడ్చిన చోటే పూడ్చాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రెండెకరాల సాగు పొలం ఇవ్వాలని, గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం కేటాయించి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నాయకులు బి.అనిల్, నాయకులు అశోక్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్

చెత్తతో సంపద సృష్టించాలి

- డిఎల్‌పిఒ నూర్జహాన్, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గ్రామాల్లో చెత్త సేకరణ ద్వారా తడి, పొడిచెత్తను వేరు చేసి ఆ వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేసి సంపద సృష్టించుకోవాలని డిఎల్‌పిఒ నూర్జహాన్, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దహరివణం గ్రామంలో చెత్త సంపద తయారీ కేంద్రంలో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యటన చేపట్టి, చెత్త సేకరణ కేంద్రాలను పరిశీలించారు. ఆదోని, కౌతాళం ఇఒఆర్‌డిలు జనార్ధన్, యోగేశ్వర రెడ్డి, జిల్లా వనరుల కేంద్రం రిసోర్స్ పర్సన్ సునీత, కోఆర్డినేటర్ నాగరాజు, సర్పంచి రామన్న, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, నాగరాజు, షేక్ అహ్మద్, లోకేష్ పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.90.16 లక్షలు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.90,16,666 వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 57 రోజుల హుండీని డార్మెటరీ హాలులో లెక్కించినట్లు తెలిపారు. స్వామివారికి నగదుతో పాటు బంగారం 13 గ్రాములు, వెండి 11 కిలోల 20 గ్రాములు సమర్పించుకున్నట్లు చెప్పారు. హుండీ పర్యవేక్షణ అధికారి ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

బాల్యం నుంచే కళల్లో నైపుణ్యత

- నేషనల్, జిఎస్ఆర్ పాఠశాలల అధినేత గోపాల్‌రెడ్డి



కళలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి - ఆదోని

బాల్యం నుంచే చదువుతోపాటు కళల పట్ల ఆసక్తి పెంచేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని నేషనల్, జిఎస్ఆర్ పాఠశాలల అధినేత గోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం జిఎస్ఆర్ పాఠశాలలో 'ఆర్ట్' జోన్ కార్యక్రమం నిర్వహించారు. కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సత్య, విజయ్ కుమార్, ఇన్‌ఛార్జీ కిశోర్, కోఆర్డినేటర్ వెంకటేష్ పర్యవేక్షించి చిన్నారులు ప్రదర్శించిన కళలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజువారీ జీవితంలో ప్రకటనలు, ఇంటీరియర్ డిజైన్, ఆర్కిటెక్చర్, సామాజిక సమస్యలను పరిష్కరించడంలో కళ దోహదపడుతుందని తెలిపారు. ఇంకా అనేక సందర్భాల్లో కళానైపుణ్యం ఉపయోగించవచ్చని చెప్పారు. కళాకారులు ప్రసిద్ధ రచనల్లో రోజువారీ జీవితాన్ని చిత్రీకరించడానికి కూడా ఉపయోగపడుతుందని తెలిపారు.

అక్రమంగా గరుసు, కొండ తవ్వకాలు చేపడితే చర్యలు

- మైనింగ్ జియాలజిస్ట్ రాజశేఖర్

ప్రజాశక్తి - ఆలూరు

అక్రమంగా గరుసు, కొండ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని మైనింగ్ జియాలజిస్టు రాజశేఖర్ హెచ్చరించారు. మండలంలోని హత్తి బెళగల్ గ్రామ సమీపంలోని 557వ సర్వే నెంబర్‌లోని 150 ఎకరాల్లో కృష్ణాపురం కొండలు, తెల్లరాయి కొండల్లో గాలిమరల కంపెనీకి కొందరు నాయకులు అక్రమంగా గరుసును రాత్రి వేళల్లో తవ్వుతున్నారని ఫిర్యాదు చేయడంతో రాజశేఖర్, మండల ఆర్ఐ బసవన్న గౌడ్, విఆర్ఒ అమరేష్ రెడ్డి సమక్షంలో బుధవారం కృష్ణాపురం ఎర్ర రాతి కొండలు, హత్తి బెళగల్ సమీపంలో ఉన్న తెల్లరాతి కొండలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... చాలా వరకు కొండలను తవ్వారని, కొండల్లో గరుసు తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. కొండల్లో రాత్రి పూట జెసిబి, హిటాచితో పెద్ద పెద్ద టిప్పర్లతో మట్టిని తరలించారని, కొందరు కొండలను చదును చేసి ఆక్రమించాలని చూస్తున్నారని చెప్పారు. వారిపై మైనింగ్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులు

అట్టహాసంగా ఎద్దుల బండలాగుడు పోటీలు

- విజేత జొన్న గిరి ఎద్దులు

ప్రజాశక్తి - పెద్దకడబూరు


మండలంలోని బాపురం గ్రామంలో వెలసిన శ్రీగంగాభవాని జాతర సందర్భంగా బుధవారం ఎద్దుల బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. బండలాగుడు పోటీలను గంగాభవాని దేవస్థానం పీఠాధిపతి శ్రీబసిలింగమ్మవ్వ ప్రారంభించారు. 14 కాడి జతలు పోటీలో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో జొన్నగిరికి చెందిన అద్దంకి మస్తాను యాదవ్ జత 6,919 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలువగా రూ.27,116, నందవరానికి చెందిన జిమకల మహేష్ ఎద్దులు 6,286 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో నిలువగా రూ.21,116, గుడెకల్ గ్రామానికి చెందిన రైతు ఆకుల మంగయ్య ఎద్దులు 6,020 అడుగులు లాగి మూడో స్థానంలో నిలువగా రూ.16,116, చౌలహల్లి గ్రామానికి చెందిన హనుమంతు ఎద్దులు 5,569 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలువా రూ.10,116 అందజేశారు. రైతులకు పీఠాధిపతి శ్రీబసిలింగమ్మవ్వ బహుమతులను అందజేశారు. సిపిఎం నాయకులు హనుమంతు, బసిరెడ్డి, బాపురం హనుమంతురెడ్డి, చిన్నతుంబళం హనుమంతు, పెద్ద రెడ్డి, కామవరం నరేష్ గౌడ్ పాల్గొన్నారు.

నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలి

- టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

పేదలకు రేషన్ అందించే రేషన్ షాపు నిర్వాహకులు అక్రమాలకు పాల్పడకుండా బాధ్యతగా వ్యవహరించాలని టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ తెలిపారు. బుధవారం నందవరం ఎస్సీ కాలనీ రేషన్ షాపు-5ను సందర్శించారు. రేషన్ షాపు కొత్త నిర్వాహకులు కె.శివ, మూకన్న, శీను ఆయనకు పూలమాల, శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పేదల పక్షపాతి అని తెలిపారు. రేషన్ మాత్రమే కాకుండా నిత్యావసర సరుకులు చక్కెర, బ్యాళ్లు అందిస్తున్నట్లు చెప్పారు. నిర్వాహకులు అక్రమాలకు పాల్పడకుండా వాటిని పేదలకు సక్రమంగా అందించాలని సూచించారు. మండలంలో రేషన్ నిర్వాహకులు అవినీతికి పాల్పడి రేషన్ బియ్యం తూకం తక్కువ ఇవ్వడం, నిత్యావసర సరుకులు ఇవ్వకుండా ఉంటే ప్రజలు నిర్భయంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలనీ చెప్పారు. రామన్న గౌడ్, సాధిక్, సజీవ్, అబ్దుల్ పాల్గొన్నారు.



రేషన్ షాపును పరిశీలిస్తున్న గురురాజ్ దేశాయ్